క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో సూర్యదేవునికి పూజలు



సూర్యనారాయణస్వామి పూజల్లో పాల్గొన్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక: మండల వ్యాప్తంగా ఆదివారం సూర్యనారాయణ స్వామి నోములు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. నోములు చేసుకున్న భక్తులు ఇళ్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పరమాన్నం తయారు చేసి భక్తులకు పంచిపెట్టారు. దీనిలో భాగంగా పలు రకాల సామాగ్రిని జారు విసిరారు. వాటిని పట్టుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ తన గృహంలో సూర్యనారాయణ స్వామి పూజలు నిర్వహించారు.

12న విశాఖలో మత్స్యకార సేవా సంఘ సమావేశం

రాంబిల్లి : వచ్చే నెల 12న విశాఖలో నిర్వహించే మత్స్యకార సేవా సంఘ సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసు కోరారు. ఆదివారం వాడ నర్సాపురంలో సర్పంచ్ కారె రామారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం కోసం ఈ సర్వసభ్య సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రయ్య, మత్స్యకార నాయకులు సూరాడ నూకరాజు, ఎరిపల్లి మొగ్గరాజు పాల్గొన్నారు.

బొడ్డేడ జన్మదిన వేడుకకు ఏర్పాట్లు

మునగపాక : ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఏర్పాట్లు చేశారు. ఉదయం పార్టీ కార్యాలయం వద్ద బొడ్డేడ ఫాలోయర్స్ ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. మండల వ్యాప్తంగా 6 వేల మంది నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ, ప్రసాద్ సొంత నిధులతో మునగపాకలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు మంత్రి గుడివాడ చేతుల మీదుగా ప్రారంభోత్సవం, పీహెచ్‌సీలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెల పంపిణీ వంటి కార్యక్రమాలు ఉంటాయని, పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీటి సమస్యకు చెక్

మునగపాక : జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని టి.సిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి అన్నారు. మండలంలోని రామారాయుడుపేటలో జరుగుతున్న పనులను ఆమె ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిల సదుపాయం అందుబాటులోకి వస్తుందన్నారు. ఇకపై తాగునీటి సమస్యలు తలెత్తవన్నారు.

పోటీతత్వంతో ఆత్మ విశ్వాసం



నమూనా పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

మునగపాక : నమూనా పరీక్షల్లో పాల్గొనడం ద్వారా పోటీతత్వం అలవాటు అవుతుందని ప్రవాస భారతీయుడు బుద్ద వెంకట శివ అన్నారు. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎన్‌ఎంఎంఎస్ నమూనా పరీక్ష నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం నింపేందుకు ఇటువంటి నమూనా పరీక్షలు దోహదపడతాయన్నారు. సంస్థ ప్రతినిధులు ఆడారి దక్షిణామూర్తి, ఎం.సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధర్నా

రాంబిల్లి : నేవీ మెయిన్‌గేటు వద్ద నేవీ నిర్వాసితులు, నేవీ ప్రభావిత గ్రామాల ప్రజలు నిర్వహిస్తున్న ధర్నా కొనసాగుతుంది. ఆదివారం నాటికి ఈ ధర్నా 91వ రోజుకు చేరుకుంది. ఉన్నతాధికారులతో జేఏసీ ప్రతినిధులు చర్చలు జరుపుతున్నా పూర్తిస్థాయిలో సఫలీకృతం కాకపోవడంతో ధర్నా కొనసాగిస్తున్నామని ఐక్య వేదిక కన్వీనర్ కారె రామారావు తెలిపారు.

నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలు



కార్యక్రమంలో విద్యార్థితో సంభాషిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు



చిన్నారికి మోడల్ ట్రై సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

ఎస్.రాయవరం : లక్ష్యాలను సాధించే దిశగా విద్య కొనసాగాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సూచించారు. అడ్డురోడ్డు శ్రీప్రజ్ఞా జూనియర్ కాలేజీలో నిర్వహించిన డిబేట్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. విద్యార్థులు ఎమ్మెల్యేతో సంభాషించారు. ప్రభుత్వ ఉద్యోగం వదిలి రాజకీయాల్లోనికి వచ్చారు. ఉద్యోగం వదిలినందుకు బాధపడుతున్నారా ...ప్రజలకు సేవ చేస్తున్నందుకు సంతోషపడుతున్నారా ..? అని పెనుగొల్లు గ్రామానికి చెందిన ఇసరపు మాధురి ఎమ్మెల్యేను ప్రశ్నించింది. దీనికి ఎమ్మెల్యే బదులిస్తూ నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలని పేర్కొంటూ తాను ఉద్యోగం కోసం చాలా కష్టపడ్డానని తెలిపారు. తాను హైదరాబాద్‌లో పని చేసినప్పుడు దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి పిలిచి ఎమ్మెల్యే టికెట్టు ఇచ్చారని, అప్పటి నుంచి తాను నిజమైన రాజకీయాలు చేస్తూ ప్రజలకు సేవలందిస్తున్నానని తెలిపారు. స్వామీ వివేకానంద స్ఫూర్తిగా ముందుకు సాగుతున్నానని అన్నారు. అలాగే పలువురు విద్యార్థులు ఎమ్మెల్యేతో సంభాషిస్తూ ప్రశ్నలు వేయగా, ప్రతి ప్రశ్నకు ఎమ్మెల్యే సమాధానం ఇస్తూ విద్యార్థులను ఆకట్టుకున్నారు. ఎమ్మెల్యేతో విద్యార్థుల సంభాషణతో కాలేజీ వార్షికోత్సవం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీరభద్రరావు, ప్రిన్సిపాల్ రాము, జిల్లా మత్స్యకార సంఘ అధ్యక్షుడు మాతా గురునాథరావు, కొత్త రేవుపోలవరం సర్పంచ్ మల్లే లోవరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు మామిడి చంటి, శ్రీపతిరాజు, పోలిశెట్టి పెద ఈశ్వరరావు, నూకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం సద్వినియోగం చేసుకోవాలి

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని పిల్లలకు మంచి విద్యాబుద్ధులు చెప్పించాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పెదఉప్పలం గ్రామానికి చెందిన ఎస్. దీవనజ్యోతికి కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీపతిరాజు సమకూర్చిన మోడల్ వీల్‌చైర్‌ను దివ్యాంగ చిన్నారికి ఎమ్మెల్యే అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, మామిడి చంటి, అచ్చుత రామరాజు, జోగిరాజు, వర్మరాజు, నరసింహమూర్తి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ నాగరాజు పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



పల్లపు ఆనందపురం ఎంపీటీసీ నానిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

మునగపాక : మునగపాక ప్రియదర్శిని పబ్లిక్ స్కూల్లో 2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు వాడ్రాపల్లి ఆవ వద్ద ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అందరూ సందడి చేశారు. విద్యాభ్యాసం నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ఇదే బ్యాచ్‌కు చెందిన పల్లపు ఆనందపురం ఎంపీటీసీ కర్రి నానిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంతోషి, సూరిశెట్టి రాము, బొడ్డేడ సంతోష్, జయ సంతోషి, లీల,శివ గణేష్ పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం



గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

మాకవరపాలెం: కొండలఅగ్రహారంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇక్కడ శనివారం తీర్థ మహోత్సవం నిర్వహించి ఆదివారం రాత్రి గౌరీపరమేశ్వరులను పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఉదయం నుంచి భక్తులు గౌరీపరమేశ్వరులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాలైన దాలింపేట, మాకవరపాలెం తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి తీర్థ మహోత్సవాన్ని తిలకించారు. సర్పంచ్ పోలిరెడ్డి అచ్చియ్యమ్మ, మాజీ సర్పంచ్ చిటికెల రమణ, గ్రామ పెద్ద రమణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీ



బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న నాయకులు

నక్కపల్లి : ఉద్దండపురం గ్రామంలో ఇటీవల మాజీ సర్పంచ్ వర్గీయుల దాడిలో గాయపడ్డ దళితుల కుటుంబాలకు ఆదివారం సమత సైనిక్ దళ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గ్రామంలో దళితులను కులంపేరుతో దూషించి దాడి చేయడం జరిగిందని దళిత నాయకులు ఆరోపించారు. ఘటన జరిగి 20 రోజులైనా చర్యలు తీసుకోలేదన్నారు. బాధిత 40 కుటుంబాలకు 25 కిలోల బియ్యం, కూరగాయలు అందజేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బోడపాటి అప్పారావు, రియల్ అంబేద్కర్ వెల్ఫేర్ అధ్యక్షుడు బర్రె అప్పారావు, గుడాల రాంబాబు, డిహెచ్‌పిఎస్ సెక్రటరీ గుడాల కృష్ణ, సమతా సైనిక్ దళ్ ప్రెసిడెంట్ టేక్ జాన్‌మెతెసెల, వైస్ ప్రెసిడెంట్ నారాయణరావు పాల్గొన్నారు.

సీతారామరాజుకు ప్రభుత్వ విప్ ధర్మశ్రీ పరామర్శ



సీతారామరాజును పరామర్శిస్తున్న ధర్మశ్రీ

కోటవురట్ల: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజును ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదివారం తంగేడులోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఇటీవల సీతారామరాజు భార్య వరలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయనను పరామర్శించి వరలక్ష్మి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు ఉన్నారు.

నేడు నవజాత శిశు సంరక్షణ విభాగం ప్రారంభం

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయంలో రూ.92 లక్షల వ్యయంతో నిర్మించిన నవజాత శిశు సంరక్షణ విభాగాన్ని సోమవారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించనున్నట్టు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు తెలిపారు.

హైవేపై ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు



జాతీయ రహదారిపై లైట్లు వేయిస్తున్న సీఐ అప్పలరాజు

పాయకరావుపేట : స్థానిక జాతీయ రహదారి వైజంక్షన్ వద్ద నుంచి నామవరం గ్రామం వరకు ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయిస్తున్నట్టు సీఐ పి.అప్పలరాజు తెలిపారు. గతంలో వేసిన లైట్లు పని చేయకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నందున ప్రమాదాల నివారణకు జాతీయ రహదారి అథారిటీతో సంప్రదించి లైట్లు వేయిస్తున్నట్లు సీఐ తెలిపారు.

సందడిగా సీతారాముల తీర్థం



కోలాటం ప్రదర్శిస్తున్న మహిళా భక్తులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఇరువాడ శివారు చిట్టిబోయిన పాలెంలో ఆదివారం రాత్రి నిర్వహించిన శ్రీ సీతారాముల తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. కోలాటం, చెట్టు భజన పోటీలు ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాలలో సమరసతా సేవ ఫౌండేషన్ సబ్ డివిజన్ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు, సర్పంచ్ పిళ్లా సతీష్, ఉప సర్పంచ్ వాసు పాల్గొన్నారు.

పాండురంగ ఆలయంలో తిరు కల్యాణం



పాండురంగ స్వామికి తిరు కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

పాయకరావుపేట : పట్టణంలో గల శ్రీరాధా రుక్మిణీ సహిత పాండురంగ దేవస్థానంలో ఆదివారం రాత్రి తిరుకల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తుని, పాయకరావుపేట పట్టణాలకు చెందిన పలువురు భక్తులు సతీసమేతంగా హాజరై కల్యాణంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు యియ్యుణ్ణి కృష్ణస్వామి, నారాయణాచార్యులు, పండితులు కళ్యాణాన్ని రమ్యంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

ముగిసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవం



బాణసంచా విన్యాసాలు

అనకాపల్లిటౌన్: గవరపాలెం గౌరీపరమేశ్వరుల మహోత్సవం శనివారం కన్నులపండువగా ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు పట్టణవాసులను ఆకట్టుకున్నాయి. మందుగుండు సీతారామయ్య బాణసంచా విన్యాసాలు జాతరలో ఆకర్షణగా నిలిచాయ.

ఇటుకల బట్టీలు.. ఉపాధికి బాటలు



ఇటుకలు తయారు చేస్తున్న ఒడిశా కూలీలు

- ఉపాధి పొందుతున్న ఒడిశా కూలీలు
- సీజన్‌లో కోటి ఇటుకల తయారీ

కశింకోట: మండలంలో ఇటుకల తయారీ జోరుగా సాగుతోంది. ఇవి పలువురికి ఉపాధి కల్పిస్తున్నాయి. ప్రస్తుతం సీజన్ కావడంతో కోటల్లా పెద్ద పెద్ద బట్టీలు ఏర్పాటు చేసి, తయారీ చేపట్టారు. ప్రధానంగా ఎక్కువ మంది ఒడిశా కూలీలు వీటిలో ఉపాధి పొందుతున్నారు. సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం ఇక్కడ శారదానది అవతల పొలాల్లో ఇటుకల తయారీ ప్రారంభమైంది. నెల్లూరుకు చెంది న ఎక్కువ మంది వ్యాపారులు ఇక్కడకు వచ్చి తయారీ ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిరాటంకంగా సాగుతోంది. మొదట్లో సుమా రు 20 వరకు బట్టీలు మొదట్లో ఉండేవి. పెట్టుబడులు, మట్టి, మెటీరియల్, కూలీ ధరలు పెరిగిపోవడంతో ఇవి క్రమేపి తగ్గిపోయాయి. ప్రస్తుతం ఆరు బట్టీలు మాత్రమే ఉన్నాయి. ఈ బట్టీల్లో సీజన్‌లో సుమారు కోటి ఇటుకలు తయారు చేస్తారు. ఒడిశాకు చెందిన సుమారు 400 మంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఇటుకల తయారీలో ఒడిశా కూలీలు దిట్టలు. దీంతో ఒడిశా కూలీలను ఇక్కడ బట్టీల నిర్వాహకులు ఏటా తీసుకువచ్చి తయారీ చేయిస్తుంటారు. సాధారణంగా ఇక్కడ ఇటుకల తయారీ డిసెంబర్ నెలలో మొదలై వర్షా కాలానికి ముందు జూన్‌లో ముగుస్తుంది. దీన్ని రైతుల పంట భూములను ఏటా లీజుకు తీసుకొని ఇటుక తయారీలో వినియోగించే మట్టి తీస్తారు. మట్టితో పాటు కొబ్బరి పొట్టు, బూడిద, ఊక కలిపి ముద్దగా తయారు చేసి అచ్చులు వేస్తారు.ఆ ఇటుకలను ఎండలో ఆరబెట్టి వాటిని ఒకచోట పెద్ద బట్టీగా పేర్చి బొగ్గు,కర్రలతో కాలుస్తారు. కాల్చిన ఇటుకలను అమ్మకానికి సిద్ధం చేస్తారు. ఇలా ఇటుక తయారీకి సుమారు నెల రోజుల వ్యవధి పడుతుంది.

తేలికపాటి ఇటుకల తయారీ

ఇక్కడ గతంలో సాధారణ బరువు, తేలిక (లైట్ వెయిట్) ఇటుకలు తయ్యారయ్యేవి. ఇప్పుడు తేలిక రకాన్ని మాత్రమే తయారు చేస్తున్నారు. ఇక్కడ తయారు అయ్యే ఇటుక నాణ్యమైనదిగా భావించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేసి తీసుకెళతారు. ఒక్కో ఇటుక నాణ్యతను అనుసరించి ప్రస్తుతం రూ.5.50 నుంచి రూ.6.50 వరకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం జగనన్న ఇళ్ల కాలనీలు, ప్రైవేటు ఇళ్ల నిర్మాణం జోరుగా జరుగుతుండడంతో వీటికి ప్రస్తుతం డిమాండ్ ఉంది.

పెట్టుబడులు అధికం

వీటి తయారీ భారంగా మారిందని, పెట్టుబడులు అధికమయ్యాయని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రా బొగ్గు టన్ను గతంలో రూ.3వేలు ఉండేదని,ప్రస్తుతం రూ.8 వేలు, ఊక రూ.2 వేల నుంచి రూ.6500 కు పెరిగినట్టు చెప్పారు. భూముల ధరలు పెరిగిపోవడం వల్ల ఇటుకల తయారీకి ఇవ్వడానికి రైతులు ముందుకు రావడం లేదని, ప్రస్తుతం ఎకరాకు ఏడాదికి రూ. లక్ష చెల్లించి మట్టి కొనుగోలు చేయాల్సి వస్తోందని తెలిపారు. ఇలా అయితే మున్ముందు వీటిని నిర్వహించడం కష్టంగా పరిణమించనుందంటున్నారు.



కాల్చడానికి బట్టీలో పేర్చుతున్న ఇటుకలు